ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 2 డిసెంబరు 2025





రేపల్లె : గుడవల్లి సమీపంలో మిల్లర్లు కొనుగోలు చెయ్యకపోవటంతో బస్తాల్లోకి ఎత్తి ఇళ్లకు చేర్చుకుంటున్న రైతులు

దిత్వా.. గండం గట్టెక్కినట్టేనా!

- తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు
- తీవ్రత నామమాత్రంగా ఉండడంతో అన్నదాతలకు ఊరట



రేపల్లె : అరవపల్లిలో తడిచిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతులు

(బాపట్ల, రేపల్లె ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం సోమవారం సాయంత్రం వరకు జిల్లాలో నామమాత్రంగా ఉండడంతో వరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆది, సోమవారాల్లో తుఫాన్ ప్రభావం చిరుజల్లులకే పరిమితమవడంతో భారీ ఊరట దక్కినట్లయింది. దిత్వా ముప్పు ఇంకా పూర్తిగా తొలగినట్లు కాదని మంగళవారం వరకు కూడా దాని ప్రభావం ఉండనుందని వాతావరణశాఖ హెచ్చరిస్తుండడం గమనార్హం. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణశాఖ అంచనాలతో గడచిన మూడు రోజులుగా అన్నదాతలకు కంటి మీద కునుకు కరువైంది. వేల ఎకరాల్లో వరి కోతకు సిద్ధంగా ఉండడం, కల్లాల్లో, రోడ్లమీద ఆరబోసిన ధాన్యం ఉండడంతో భయాందోళనలకు గురిచేసింది. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకున్నప్పటికీ భారీ వర్షాలు కురిస్తే భారీ నష్టం తప్పదనే అంచనాకు రైతాంగం వచ్చింది.

బ్యాంక్ గ్యారెంటీలపై సమీక్ష..



రేపల్లె : 216 జాతీయరహదారి వెంట వర్షానికి పట్టాలుకప్పిన ధాన్యం

ధాన్యం సేకరణ ప్రారంభంలోనే బ్యాంకు గ్యారెంటీలకు సంబంధించి సమస్య ఉత్పన్నమైంది. దాదాపుగా ఈ ప్రక్రియను కొలిక్కి తేగలిగారు. ఇదే అంశంపై మిల్లర్లు, అధికారులతో సోమవారం కూడా కలెక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. వరి కోతకు సిద్ధంగా ఎంత ఉంది, కల్లాల్లో ఉన్న పరిమాణం ఎంత అనే అంశాలపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలోని సిబ్బంది నివేదిక ఇవ్వాలని, దానికి అనుగుణంగా మండలాల వారీగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రణాళికలు రచించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ఒక్క రోజే 1,800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించగా మొత్తం 5,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సివిల్ సప్లయిస్ విభాగం సేకరించింది. 11,500 టన్నుల ధాన్యం కొనుగోలు షెడ్యూలింగ్ ఇవ్వడం జరిగిందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ధాన్యం.. దైన్యం

తుఫాన్ ప్రభావంతో ముందే నూర్పిళ్లు చేసి తీసుకెళ్లిన ధాన్యాన్ని.. రైతు సేవా కేంద్రాల వద్ద కొనుగోలు చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిత్వా తుఫాన్ నేపథ్యంలో బాపట్ల జిల్లాను ఆరెంజ్ జోన్‌గా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా హార్వెస్టల ద్వారా కోత పూర్తి చేసిన వరి ధాన్యాన్ని పెనుమూడి 216 జాతీయ రహదారి నుంచి నడింపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఆరబోశారు. మూడురోజులుగా మిల్లర్లు, ఆర్ఎస్‌కేల చుట్టూ ధాన్యం కొనుగోలు చేయాలని ప్రాధేయపడుతున్నా.. వారం వరకు కొనుగోలు చేయమంటూ సమాధానం వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇక దళారులు తేమశాతం సాకు చూపి.. రూ.1,300ల నుంచి రూ.1,420 కొనుగోలు చేస్తామని చెబుతున్నారని.. అంత తక్కువగా విక్రయిస్తే.. తమకు పెట్టుబడి కూడా సరిపోదని నిట్టూరుస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1792 మద్దతు ధర లభించడం లేదని అంటున్నారు. రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల ఆర్ఎస్కేల్లో ద్వారా మిల్లర్లు ఎవరూ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. కనీసం పంటను తీసుకుని మిల్లర్లు గోడౌన్‌లో, వ్యవసాయ యార్డుల్లో నిల్వ ఉంచుకోవాలని పలుమార్లు వ్యవసాయాధికారులకు విన్నవించినా ఫలితం లేదని అంటున్నారు. దీంతో రైతలు దేవుడిపైనే భారం వేశారు.

3వ నెంబరు ప్రమాద సూచిక

నిజాంపట్నం హార్బర్‌లో సోమవారం రెండవరోజు 3వ నంబరు ప్రమాద సూచిక కొనసాగుతుందని పోర్టు అధికారులు తెలిపారు. దిత్వా తుఫాన్‌కారణంగా సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. అలల ఉధృతి, ఈదురు గాలులు ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలపటంతో మత్స్యకారులంతా ఒడ్డుకు చేరుకున్నారని చెప్పారు. బోట్లన్నీ జట్టీలకే పరిమితమయ్యాయని తెలిపారు.



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ఒక్క రైతు కూడా నష్టపోకూడదు

- జిల్లాలో అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు
- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ కారణంగా జిల్లాలో అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దిత్వా తుఫాన్ కారణంగా ఎక్కడా కూడా పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల మొంథా తుఫాన్ నేపథ్యంలో పనిచేసిన విధంగా.. ఇప్పుడూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్‌ఓపీ ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. గ్రామ సచివాలయాలలో నైపుణ్యం కలిగిన సిబ్బందికి శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయం ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసుకొని.. మండలస్థాయి అధికారి సూపర్‌వైజర్‌గా ఏర్పాటు చేసి ఒక ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. ప్రతిశాఖకు అవసరమైన జూమ్ లైసెన్స్ కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసుకొని పని వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తూ డ్యాస్ బోర్డులో ఉంచాలన్నారు. జిల్లాలో 10 శాతం కూడా వరికోతలు అవ్వలేదని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వరి కోతలను నిలుపుదల చేయండి

తుఫాన్ కారణంగా ఏ రైతు పంటనష్టపోకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ మండల స్థాయి వ్యవసాయశాఖాధికారులకు సూచనలు చేశారు. వీక్షణ సమావేశంలో ఈ మేరకు వారికి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 12 మండలాలలో వరి కోతదశలో ఉందని.. తుఫాన్ కారణంగా వరికోతలు నిలుపుదల చేయాలని తెలిపారు. 167 కొనుగోలు కేంద్రాలలో 85 కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. రైతులతో కూడిన వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని... వారి సమస్యలను వాట్సప్‌లో పెట్టేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జేసీ భావన విశిష్ఠ, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ, అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

రేపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్ నిజాంపట్నం హార్బర్ రోడ్డులో అధికారులు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు గోనె సంచులు, టార్పాలిన్ పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని, భారీ వర్షాల హెచ్చరికలతో అత్యవసరంగా గోడౌన్‌లను గుర్తించామని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో గోడౌన్‌లు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. నిజాంపట్నంలో 30 ట్రాక్టర్లను రైసు మిల్లులకు అనుసంధానం ఇచ్చామని తెలిపారు. అనంతరం నిజాంపట్నంలోని భారతీయ తీర రక్షణ దళం కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. కమాండెంట్ వీపీఎస్‌పీవీ ప్రసాద్‌తో తీరప్రాంత సంరక్షణపై చర్చించారు. నూతనంగా లైట్‌హౌస్‌కు 1.5ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు.

ప్యార్లీ డ్రెయిన్ కట్ట స్వాహా!

- కట్టను రాత్రిళ్లు ఇసుక తరలింపు..
- ఆక్రమణలతో వ్యవసాయం, గృహ నిర్మాణాలు



ప్యార్లీ డ్రెయిన్ కట్ట ఇసుకను అక్రమంగా తవ్వుకొని వెళ్లిన దృశ్యం

బాపట్ల రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం వెదుళ్ళపల్లి సమీపంలోని ప్యార్లీ డ్రెయినేజీ సెక్షన్ కార్యాలయం నుంచి మరుప్రోలువారిపాలెం బ్రిడ్జి వరకు ఉన్న కాల్వకట్టను అక్రమార్కులు రాత్రిళ్లు కొల్లగొడుతున్నారు. వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించుకుంటున్నారు. ఇలా కాల్వ కట్టను తవ్వేస్తే.. వరదల సమయంలో సమీప గ్రామాలకు ముంపు తప్పదని గ్రామస్థులు వాపోతున్నారు. కొంతమంది అయితే కాల్వకట్టను ట్రాక్టర్లతో దున్ని.. వ్యవసాయం చేసుకునేందుకు సిద్ధం చేస్తున్నారు. పోతురాజు కొత్తపాలెం గ్రామ సమీపంలో ప్యార్లీ డ్రెయిన్ కట్టను అక్రమించుకొని ఇంటి నిర్మాణాలు కూడా చేపట్టారు. ప్యార్లీ డ్రెయిన్ కట్ట ఆక్రమణలు, ఇసుక దోపీడీలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీ.. ప్రథమ స్థానంలో ఏపీ

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పేదలకు అందించే సంక్షేమ పింఛన్లు పంపిణీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని.. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలం మైలవరం పంచాయతీ పరిధిలోని ఏలేశ్వరవారి పాలెంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పింఛనుల పంపిణీ చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క స్పౌజ్ పింఛను కూడా మంజూరు చేయలేదని, కూటమి ప్రభుత్వం 1.08 లక్షల మందికి మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 65 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం రాయితీపై రైతుకు ట్రాక్టర్‌ను మంత్రి అందజేశారు. అన్నదాతను ప్రోత్సహించేందుకు 90శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసి, డబ్బులు ఇవ్వకుండా మొండి చేయి చూపితే కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించిందన్నారు. సంక్రాంతి నాటికి శాంతినగర్ - మైలవరం రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని మంత్రి స్పష్టం చేశారు. మైలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 162 మందికి ఎన్ఆర్ఈడీసీఏపీ, అసిస్టల సహకారంతో సమకూర్చిన సైకిళ్లను మంత్రి రవికుమార్ పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,300 మందికి సైకిళ్ల పంపిణీ చేశామని మంత్రి చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనంను రవికుమార్ పరిశీలించారు. ఆహారం నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మానం మురళీమోహన్‌దాస్, పరమేష్, సత్యనారాయణ, రాధాకృష్ణ మూర్తి, రామలింగయ్య, కృష్ణమారుతి, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీఓ వరూధిని, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఎంఈఓ కేవీ శ్రీనివాసరావు, హెచ్ఎం నాగేశ్వరరావు, ఏఓ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరవారిపాలెంలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

క్రీడా కిట్లు వచ్చేశాయ్



ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ

బాపట్ల: డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన క్రీడా పరికరాలు సరఫరా చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.17వేలు, రూ.30వేలు విలువైన కిట్లు ఇప్పటికే చేరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దాదాపు 3వేలకుపైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 6 లక్షల మందికి పైగా విద్యార్థులున్నారు. పాఠశాలల్లో విశాలమైన క్రీడా ప్రాంగణాలు, నిష్ణాతులైన ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. అయితే క్రీడా పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే క్రీడలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఏర్పాట్లు చేసింది.



క్రీడా కిట్లు ఇలా..

షటిల్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖో-ఖో, హ్యాండ్‌బాల్ క్రీడా పరికరాలు.. క్యారమ్స్, చెస్ బోర్డులు క్రీడా కిట్లలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.17వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు విలువైన క్రీడా పరికరాలు ప్రభుత్వం పంపించినట్లు ఉపాధ్యాయులు వెల్లడించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.

షట్‌డౌన్..!

- తుఫాన్ ప్రభావాల పేరిట బీచ్‌ల మూసివేత
- సన్నద్ధత ఉండాలే గాని... నిషేధం ఏంటనే ప్రశ్నలు
- పర్యాటకరంగంపై తీవ్ర ప్రభావం
- వందల మంది ఉపాధిపై పరోక్షంగా దెబ్బ



8

నిర్మానుష్యంగా ఉన్న సూర్యలంక బీచ్

తుఫాన్‌లు సంభవించడం, తీరం దాటడం, ఆ ప్రభావం ఆయా జిల్లాలపై ఉండడం తరచూ జరిగేదే. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు యంత్రాంగం పూర్తి సన్నద్ధతగా ఉండడం కూడా నిరంతరం జరిగే ప్రక్రియ. సన్నద్ధత అంటే షట్ డౌన్ చేయకుండా, ఆయా కార్యకలాపాలు స్తంభించకుండా తీవ్రతను బట్టి తీసుకునే నిర్ణయానికి యంత్రాంగం సిద్ధమై ఉండడం. కానీ జిల్లాలో జరుగుతోంది వేరుగా ఉంది.

పీఎంఏవై గడువు పొడిగింపు..!

- మరో 14 రోజులు పొడిగించిన ప్రభుత్వం
- సచివాలయ సిబ్బందితో విస్తృత స్థాయిలో సర్వే
- అర్హులైన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్చడమే లక్ష్యం

బస్టాండ్‌లో..అటో..ఇటో..ఎటో.. 8

- వరుస ప్రమాదాలతో భయాందోళన
- స్త్రీ శక్తి పథకంతో మరింత పెరిగిన రద్దీ



దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కృషి

- శాప్ చైర్మన్ రవి నాయుడు
- దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి వెంకటరెడ్డి

మాచర్లలో ప్రేమ జంట ఆత్మహత్య 6

- కుడి కాలువలో దూకి బలవన్మరణం
- యువతి మృతదేహం లభ్యం.. యువకుడు గల్లంతు

విద్యార్థినిపై అత్యాచారం

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

బకాయి భారం

- మున్సిపాలిటీలకు చేకూరని ఆస్తి పన్ను ఆదాయం
- ప్రభుత్వ సంస్థల నుంచి రూ.52.36 కోట్లు పెండింగ్
- ఏళ్ల తరబడి వసూలు కాని వైనం..

మునిసిపాలిటీలకు.. ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీలకు ప్రభుత్వ సంస్థలు రూ.52.36 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లిస్తే పట్టణాల్లో ప్రజలకు అవసరమైన ప్రగతి పనులు చేపట్టవచ్చు. బకాయిల వసూలు కోసం మునిసిపాల్టీలకు అయా ప్రభుత్వ కార్యాలయాల అధిపతులకు లేఖలు రాస్తున్నా ప్రయోజనం లేదు. ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాలేదంటూ అధికారులు పురపాలకులకు సమాధానం ఇస్తున్నారు.

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మునిసిపాల్టీకి రూ.3 కోట్లు, సత్తెనపల్లి రూ.1.05 కోట్లు, మాచర్ల కోటి రూపాయలు, చిలకలూరిపేట రూ.80 లక్షలు, దాచేపల్లి రూ.16 లక్షలు, వినుకొండ రూ.46 లక్షలు, పిడుగురాళ్ల రూ.37 లక్షలు, గురజాల మునిసిపాల్టీకి రూ.29 లక్షలు బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

బాపట్ల జిల్లా కేంద్రం బాపట్ల మునిసిపాల్టీలో రూ.1.40 కోట్లు, రేపల్లె రూ.83 లక్షలు, చీరాల రూ.1.09 కోట్లు, అద్దంకి మునిసిపాల్టీలో రూ.32 లక్షలు ప్రభుత్వ సంస్థల బకాయిలు పేరుకుపోయాయి. ఈ బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా వసూలు అయ్యే పరిస్థితులు లేవని సదరు అధికారులు చెబుతున్నారు. ఆస్తి పన్ను బకాయిలు గురించి లేఖలు రాస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదంటున్నారు.



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మునిసిపాల్టీలకు ప్రైవేట్ సంస్థల కంటే ప్రభుత్వ సంస్థల ఆస్తి పన్ను మొండి బకాయి అధికంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాల ఆస్తి పన్ను బకాయి కోసం అధికారుల చుట్టూ మునిసిపల్ సిబ్బంది ప్రదక్షిణలు చేస్తున్నారు. మునిసిపాల్టీలు విద్యుత్ బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగితే ప్రభుత్వ సంస్థ అని కూడా చూడకుండా విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తారు. అటువంటిది మునిసిపాల్టీకి మాత్రం ఆస్తి పన్ను చెల్లించే విషయంలో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాలు.. సంస్థలకు సంబంధించి రూ.39.62 కోట్లు ఆస్తి పన్ను బకాయి ఉంది.కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు.. సంస్థలకు సంబంధించి రూ.12.74 కోట్ల ఆస్తి పన్ను బకాయి (మిగతా 8వ పేజీలో)

కార్మిక చట్టాల నిర్వీర్యంపై యుద్ధభేరి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



సభలో ప్రసంగిస్తున్న గుజ్జుల ఈశ్వరయ్య, వేదికపై సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హక్కులను హరించేలా పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వంపై యుద్ధభేరి మోగించేందుకు కార్మిక లోకం సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. గుంటూరు సంగడిగుంట రేగుల రాఘవయ్య భవన్‌లో సోమవారం హమాలీ (ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు అధ్యక్షతన కార్మిక నేత జీవీ కృష్ణారావు 9వ వర్ధంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గుజ్జుల ఈశ్వర్యయ్య మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మూతబడుతున్న పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావుకు జీవీకే అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కోట మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, కాసా రాంబాబు, పులి సాంబశివరావు, రాజేంద్ర, బందెల నాసర్, జి.పుప్పాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు పునీత శౌరివారి తిరునాళ్ళ మహోత్సవం



విద్యుత్ దీపాలంకరణలో పునీత శౌరి దేవాలయం

వట్టిచెరుకూరు, డిసెం బరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు గ్రామంలో పునీత శౌరి వారి దేవాలయ తిరునాళ్ళ మహోత్సవం డిసెంబరు 3న జరగనుంది. తిరునాళ్లను వైభవంగా జరుపుకొనేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరునాళ్ళను పురస్కరించుకొని దేవాలయ ప్రాంగణం, ప్రధాన వీధుల్లో వివిధ దుకాణాలతో పండుగ వాతావరణం నెలకుంది. బుధవారం బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య పలువురు పాదర్లతో కలసి దేవాలయ ప్రాంగణంలో సమిష్టి బలిపూజా కార్యక్రమంలో ప్రార్ధనలు నిర్వహిస్తారని ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫాదర్ దిలీప్ కుమార్ తెలిపారు. కాగా, తిరునాళ్ళ మహోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకొనేందుకు దేవాలయ పెద్దలు, గ్రామస్థులు పోలీసులకు పూర్తి సహకారం అందించారని సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ కోరారు.

ధాన్యం కొనుగోళ్ల.. సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లులు కస్టోడియన్ అధికారులు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. పౌకరసరఫరాల శాఖ, కస్టోడియన్ అధికారులతో కలెక్టర్ సోమవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణలో అవకతవకలు జరగకుండా రైస్ మిల్లులలో ధాన్యం భద్రపరిచే బాధ్యత కస్టోడియన్ అధికారులదేనని తెలిపారు. ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు వచ్చే ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో నవీకరించాలన్నారు. ప్రతిరోజు కేటాయించిన రైస్ మిల్లుల వద్దకెళ్లి ఫొటో తీసి పంపాలన్నారు. ధాన్యం సేకరణలో సమస్యలు వస్తే టోల్ ఫ్రీ నంబరు 1967, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నంబరు 77028 06804కు కాల్ చేసేలా రైతులను చైతన్య పర్చాలన్నారు. వీటిని ప్రతిరైస్ మిల్లు, ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. జేసీ భావన, పౌరసరఫరాల జీఎం శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

ముగ్గురు చోరుల అరెస్టు

● నిందితుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ● 26.5 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గోరంట్లకు చెందిన చిల్లర సురేష్, విజయవాడ రామలింగేశ్వర నగర్‌కు చెందిన కాజా నాగ వీర భాస్కరరావు, శివ నాగరాజు కాలనీ నాలుగో లైన్‌కు చెందిన లంకా రాజేష్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ 26.50 లక్షలు విలువ చేసే 227 గ్రాముల బంగారు, 182 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. గుంటూరు సంపత్ నగర్‌కు చెందిన అవ్వారి వెంకట అప్పయ్య శాస్త్రి ఈ నెల 8న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి తిరుపతి వెళ్లారు. 12న తిరిగి ఇంటికి రాగా మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా దొంగలు బీరువా తాళాలు పగలగొట్టి అందులో దాచిన 152 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేశారు. వారిని విచారించగా నిందితులు మరో మూడు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ చిల్లర సురేష్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. గోరంట్లకు చెందిన అతడు పగలు రెక్కీ నిర్వహించి రాత్రి ఇల్లు లూటీ చేయడంలో దిట్ట అని చెప్పారు. అతడిపై అధికారికంగా 78, అనధికారికంగా 150కి పైగానే కేసులు ఉండవచ్చని తెలిపారు. మిగతా ఇద్దరు నిందితులకు ఇతడితో తెలంగాణలోని హుజూర్‌నగర్ జైల్లో పరిచయం ఏర్పడిందని చెప్పారు. కేసును ఛేదించి సొత్తు రికవరీ చేసిన అధికారులు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందించి అభినందించారు.

పిన్నెల్లి సోదరుల అరాచకాలు కనపడలేదా

● కాసుపై ఎమ్మెల్యే జూలకంటి మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పక్కన ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి సోదరులు ఎన్నికల ముందు తర్వాత మాచర్లలో ఎన్ని అరాచకాలు చేశారో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డికి కనబడలేదా అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. సోమవారం నరసరావుపేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, తాను మాచర్ల నుంచి ఎప్పుడూ పారిపోలేదని, కాసు మహేశ్‌రెడ్డి ఆయన తండ్రి కృష్ణారెడ్డి నరసరావుపేట వదిలి పారిపోయి గురజాల వచ్చారని అన్నారు. విగ్రహాల దొంగ, అవినీతి పరుడు, దోపిడి దారుడు వైసీపీకి జిల్లా అధ్యక్షుడిగా ఉండటం దౌర్భాగ్యమని అన్నారు.

● దోచుకున్న డబ్బుతో కాసు సెంట్రల్ హాల్

గురజాలలో దోపిడి చేసిన డబ్బుతో కాసు సెంట్రల్ హాల్ కట్టారని ఆరోపించారు. వరికపూడిశల ప్రాజెక్టు తీసుకు వస్తామని 50 ఏళ్ళు కాసు కుటుంబం పల్నాడు ప్రజల్ని మోసం చేసిందన్నారు. విగ్రహాల దొంగ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కాసు మహేశ్‌రెడ్డికి ఉన్న లింకేమిటని ప్రశ్నించారు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి కాసు మహేశ్‌రెడ్డి తాతను ఎదుర్కొన్న మొనగాడు తన తండ్రి జూలకంటి నాగిరెడ్డి అన్నారు. ఇద్దరు ముస్లింలను హత్యచేసిన కేసులో చిన్నతనంలోనే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముద్దాయని అన్నారు. ఆత్మకూరు సంఘటన జరిగినప్పుడు తాను హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పారు. కాసుకు ధైర్యం ఉంటే రుజువు చేయాలని, అలా చేస్తే తాను రాజకీ యాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు. సమావేశంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో వ్యాస రచన పోటీలు



సమావేశంలో మాట్లాడుకుంటున్న ఉన్నత విద్య మండలి చైర్మన్ మధుమూర్తి, వీసీ గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో విక్సిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్-2026 వ్యాస రచన పోటీలు సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి, ప్రొఫెసర్ జి.రోశయ్య, డాక్టర్ మాథ్యూస్ శ్రీరంగం నేతృత్వం వహించారు. రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల విభాగాలకు చెందిన 40 మంది ప్రొఫెసర్లు పా ల్గొని 100 వ్యాసాలు మూల్యాంకనం చేసి, 3,659 వ్యాసాలు పరిశీలిం చారు. యువజన సేవల శాఖ నుంచి పీవీఎస్ మల్లేశ్వరరావు సూచన లు అందించారు. మూల్యాంకనం పూర్తయిన తర్వాత ఫలితాలను యువజన సేవల కమిషనర్‌కు అధికారికంగా పంపించినట్లు ఉన్నత విద్య మండలి వెల్లడించింది.

జనవరి 7, 8 తేదీలలో జాతీయ సదస్సు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జనవరి 7,8వ తేదీలలో జాతీయ సదస్సు జరగనుంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు సోమవారం విడుదల చేయగా, రెక్టార్ ప్రొఫెసర్ ఆర్. శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తరఫున ప్రొఫెసర్ జి.రోశయ్య ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

గోడపత్రిక ఆవిష్కరణ

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల సాధన సమన్వయకర్తలకు సోమవారం వర్సిటీలో ఒకరోజు వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ ఉన్నత విద్యా మండలి-ఏఎన్‌యూ సంయుక్తంగా డ్రైవింగ్ ఎక్సలెన్స్-ఇన్‌స్టిట్యూషనల్ స్ట్రాటజీస్ అనే అంశంపై నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన చైర్మన్ ఆచార్య మధుమూర్తి క్వాంటం టెక్నాలజీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య విజయ భాస్కరరావు, ప్రత్యేక గౌరవ అతిథిగా ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కే.గంగాధరరావు హాజరయ్యారు.

దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కృషి

● శాప్ చైర్మన్ రవి నాయుడు ● దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎండీ భరణి, ఎమ్మెల్యే నసీర్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల లోని ప్రతిభను వెలికితీసి వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రస్థాయి దివ్యాంగుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, శాప్ ఎండీ భరణితో కలిసి రవినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో రవినాయుడు మాట్లాడుతూ, దివ్యాంగులకు తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడాపాలసీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్ స్టేడియంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ మాట్లాడుతూ, పోటీలకు పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారని అన్నారు. మంగళవారంతో ఈ పోటీలు ముగుస్తాయని, విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, టీడీపీ నాయకులు అబ్బూరు మల్లి, మన్నవ వంశీ, శాప్ సభ్యులు సంతోష్ కుమార్, జగదీశ్వరి, కార్పొరేటర్లు మీరావలి, అశోక్, కోచ్ లోహిత్, నళిని తదితరులు పాల్గొన్నారు.

9 కోట్లు మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌ను ఆశ్రయించిన కురగల్లు కో ఆపరేటివ్ బాధితులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొసైటీ పేరుతో దాదాపు రూ 9.కోట్లు దోచుకున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళగిరి రూరల్ పరిధిలోని కురగల్లుకు చెందిన గ్రామస్థులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.9 కోట్లు డిపాజిట్లు సేకరించి, వాటిని మాయం చేశారని వాపోయారు. కష్ట సమయంలో అక్కరకు వస్తాయని దాచి పెట్టుకుంటే, వాటిని పక్కదారి పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ, నీరుకొండ, కురగల్లు గ్రామాలకు కలిపి ది కురగల్లు ప్రైమరీ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేసి తమను మోసం చేశారని పేర్కొన్నారు. దీనిపై సొసైటీలో తీర్మానం చేసి ఈ ఏడాది అక్టోబరు నెలలో సీఈవో రమేష్ అనే అధికారిని, సహకరించిన సిబ్బందిని తొలగించారని వివరించారు. వారి వద్ద ఉన్న సొమ్మును ఇప్పటివరకు బ్యాంకుకు జమ చేయలేదన్నారు. సొమ్మును రికవరీ చేసి తమ ఖాతాలకు జమ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. దీనిపై త్వరలోనే డీసీసీబీ చైర్మన్‌ను కలవనున్నట్లు స్పష్టం చేశారు.



ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి 30 రోజుల జైలు

● మరో నలుగురికి రూ. 10 వేల చొప్పున జరిమానాలు



క్రోసూరులో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

క్రోసూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి సత్తెనపల్లి కోర్టు 30 రోజులు జైలు శిక్ష విధించింది. మరో నలుగురికి జరిమానాలు విధించింది. క్రోసూరులో సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో కాకరపర్తి కోటి రత్నం అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ చిక్కాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచగా 30 రోజుల జైలు శిక్షను విధించింది. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మరో నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికీ రూ. 10 వేల చొప్పున జరిమానాలు విధించింది. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు తెలియజేశారు.

కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి వెంకటరెడ్డి



కోర్టు వద్ద పిన్నెల్లి వెంకటరెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో ఏ8 నిందితుడిగా ఉన్న కండ్లకుంట సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి సోమవారం మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. గత మే నెల 24వ తేదీన గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావులును బోదలవీడు సమీపంలో హత్యకు గురయ్యారు. ఈ కేసులో పోలీసులు 9 మందిని నిందితులుగా చేర్చగా వీరిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఏ6, ఏ7లుగా వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఉన్నారు. కాగా ఏ8నిందితుడిగా ఉన్న పిన్నెల్లి వెంకటరెడ్డి మాచర్ల కోర్టులో లొంగిపోగా న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ గుంటూరు జిల్లా జైలుకు రిమాండ్ విధించారు.

విద్యార్థినిపై అత్యాచారం

● కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

చేబ్రోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో లోబర్చుకొని తనపై ఓ యువకుడు అత్యాచారం చేశాడని ఓ విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, తెనాలి పట్టణానికి చెందిన ఓ యువతి, చేబ్రోలు మండలంలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థలో ఫార్మసీ చదువుతూ ఓ ప్రైవేటు వసతి గృహంలో నివసిస్తోంది. అదే వసతి గృహంలో ఉన్న సహచర విద్యార్థినుల ద్వారా కృష్ణాజిల్లా ఘంటసాల ప్రాంతానికి చెందిన నందు అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడినట్లు సమాచారం. అతను మాయమాటలు చెప్పి యువతిని నారాకోడూరు, గుంటూరు ప్రాంతాలలోని లాడ్జీలకు తీసుకెళ్లి అక్కడ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను వీడియోలు చూపించి బెదిరిస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బాధిత యువతి ఆదివారం చేబ్రోలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సోమవారం ఘటన జరిగిన లాడ్జిని నారాకోడూరులో పరిశీలించారు.

మాచర్లలో ప్రేమ జంట ఆత్మహత్య

● కుడి కాలువలో దూకి బలవన్మరణం
● యువతి మృతదేహం లభ్యం.. యువకుడు గల్లంతు



వీర్ల గోవర్ధన్ (ఫైల్‌ఫొటో)

మాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి చెందిన ప్రేమ జంట సోమవారం నాగార్జున సాగర్ కుడి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణానికి చెందిన దాసరి లక్ష్మి (22), వీర్ల గోవర్ధన్ (20) గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి వివాహానికి పెద్దల అంగీకారం కోరారు. వేర్వేరు సామాజిక వర్గాలు కావడంతో ఇరువైపుల నుంచి అంగీకారం లభించలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఇరువురు కాలువలో దూకారు. సమీపంలో స్నానం చేస్తున్న కొందరు యువకులు గమనించి కాపాడేందుకు ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. నీటి ప్రవాహానికి ఇరువురు కొట్టుకుపోయారు. యువతి దాసరి లక్ష్మిని స్థానికులు కాలువ నుంచి బయటకు తీసినప్పటికీ అప్పటికే మృతిచెందింది. కాగా గోవర్ధన్ కోసం గాలింపు చేపట్టారు. సంఘటనా స్థలం వద్దకు బంధువులు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా, దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 580.10 అడుగులు ఉంది. ఇది 283.30 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6,006 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5,226 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 24,481 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 37,513 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 37,513 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 43.54 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి మూడు వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతోంది.

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్లు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో పింఛన్లు ఇస్తున్నామని, పేదలకు అండగా నిలబడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం అన్నారు. అన్ని సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం రికార్డులు సృష్టిస్తుందన్నారు. భారీ బడ్జెట్ అయినప్పటికి సీఎం చంద్రబాబునాయుడు అనుభవంతో పటిష్టంగా అమలు చేస్తున్నారని చెప్పారు. పింఛన్ల కోసం ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ 33 వేల కోట్లు ఖర్చుపెడుతుందన్నారు. మహారాష్ట్ర లాంటి పెద్ద రాష్ట్రంలో పింఛన్లకు కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేస్తున్నారని, తెలంగాణలో రూ.2 వేల కోట్లు, తమిళనాడులో రూ.వేయి కోట్లు, కర్నాటకలో రూ.600 కోట్లు మాత్రమే ఖర్చుచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వడంతో పాటు పింఛన్ల కోసం రూ. 2700 కోట్లు పంపిణీ చేయడం ఆషామాషి కాదన్నారు. కొత్తగా 5 లక్షల ఇళ్ళు మంజూరు చేస్తున్నామని, నాణ్యతతో ఇళ్ళ నిర్మాణం జరుగుతుందని కొమ్మాలపాటి శ్రీధర్ చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	126, 135, 146
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

37,392 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 39,823 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,392 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,063 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17300
నెంబరు. 5	11000	15000
273	---	----
341	10500	17000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15200
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	17400
దేవనూరు డీలక్స్	11000	16700
ఆర్మూరు	10500	13300

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	11000	17400
నెంబరు. 5	----	----
273	----	----
341	12000	17000
4884	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	15000
సింటెంటా బ్యాడిగి 5531	11000	17500
దేవనూరు డీలక్స్	10500	16300
తాలుకాయలు	5000	8000

ఉపకార వేతనాల పరీక్షలు పగడ్బంధీగా నిర్వహించాలి : కలెక్టర్

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ ఉపకారవేతనాల పరీక్షలు పగడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షల నిర్వహణపై సంబంధితాధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వీక్షణ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ప్రతిభ ఉపకారవేతనాల పరీక్షలు ఈనెల 7వ తేదీన జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, పరీక్షలలో ప్రతిభ కనబరిచినవారికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు అందజేస్తారని తెలిపారు. జిల్లాలో బాపట్ల, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజనల్ పరిధిలో 11 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు సమర్థంగా నిర్వహించటానికి అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

6జీ పరిశోధన, ప్రయోగశాల ప్రారంభోత్సవం

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నూతన పరిజ్ఞానం పెంపొందించుటకు 6జీ సాంకేతికలో నైపుణ్యత ఎంతో దోహదం చేస్తుందని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. 6జీ సాంకేతికపై అంగీకార ఒప్పందం కరపత్రాలను సోమవారం ఆయన అవిష్కరించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ మారుతున్న కాలాన్ని బట్టి నూతన సాంకేతికత ప్రాముఖ్యత, ఉపయోగాలు ఇంజనీరింగ్ కళాశాలల పురోగతికి ఎంత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, జాయింట్ సెక్రటరి దొడ్డపనేని వెంకయ్యచౌదరి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి సేవ చేయటం ఎంతో అదృష్టం

● మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్



అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీ అయ్యప్ప స్వామికి సేవ చేసుకునే భాగ్యం కలగటం తనకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని భారతీయ జనతా పార్టీ జాతీయకౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానంలో గత 41 రోజులుగా మాలధారులకు నిర్వహిస్తున్న చద్ది కార్యక్రమం ముగింపు సందర్భంగా శివాలయంలో ప్రత్యేక హోమాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మాలధారులతో పూజలు చేశారు. చివరిరోజు ముగింపు సందర్భంగా స్వాములకు చద్ది వడ్డించారు. ఈ పూజలలో దేవస్థానం చైర్మన్ బూర్లె రామసుబ్బారావు, గురుస్వామి కొటికలపూడి సుబ్బారావు, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్త్రీలు అన్ని రంగాలలో రాణించటం అభినందనీయం

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్త్రీలు అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానంగా రాణించటం అభినందనీయమని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ బి.శరత్‌బోస్ అన్నారు. బాపట్ల మహిళా సమైక్య ప్రథమ వార్షికోత్సవం సోమవారం బాపట్ల ఈకోహౌస్‌లో నిర్వహించగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మల్లాది వెంకట సుబ్బమ్మ, కమలమ్మ మహిళా సంఘాల ద్వారా సమాజానికి సేవలందించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సమైక్య సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు పంగులూరి హరిప్రసాద్, టైలరింగ్ టీచర్ సీహెచ్ శాంతి, సమైక్య కార్యదర్శి బి.అనంతకుమారి పాల్గొన్నారు.



గోవాడలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



నిజాంపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందిస్తాం

● ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్‌లు అందిస్తామని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని గోవాడ ఎస్టీ, బీసీ, ఎస్సీ కాలనీల్లో ఆయన పెన్షన్‌లు అందజేశారు. అనంతరం ఆనందబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న వారికి కూడా పెన్షన్‌లు సక్రమంగా అందించలేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన మొదటి నుండి పెంచిన పెన్షన్‌లు అందించడం జరిగిందన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద రమేష్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షెడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మపర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి గంగాధర్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ మండవ విజయలక్ష్మి తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. నిజాంపట్నంలో ఎన్టీఆర్ పెన్షన్‌పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మేకల శోభారాణి ఇంటికి వెళ్ళి పింఛన్‌ను అందజేశారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. తుఫాన్‌షెల్టర్‌లో అరటిబోదెలతో గృహోపకరణాల తయారీపై శిక్షణపొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, మత్స్యకార అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

● ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు వెంటనే పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని 5, 6, 7వ వార్డులో సోమవారం ఇంటింటికి తిరుగుతూ పించన్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కోట్లాది రూపాయలు మంజూరు చేయించటంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, మేకా రామకృష్ణ, గోగినేని పట్టాభి రామారావు, అలపాటి వేణుగోపాల్, పంతాని సాయికుమార్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, గుర్రం మురహరిరావు, లీలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.



5వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్న అనగాని శివప్రసాద్

● కర్లపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెం గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ సీనియర్ నాయకుడు, నల్లమోతువారిపాలెం యూనిట్ ఇన్‌చార్జి మాడా శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.చిన్న పంపిణి చేశారు.

● పిట్టలవానిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా 14 గ్రామపంచాయతీలకు చెందిన పెన్షన్ లబ్ధిదారులకు పిట్టలవానిపాలెం ఎంపీడీవో సీహెచ్ శేఖర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణి చేశారు. జీఎన్‌పాలెం గ్రామపంచాయతీలో ఎంపీడీ సీహెచ్ శేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధ లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు.

● బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం వెస్టుబాపట్ల, ఆసోదివారిపాలెం పంచాయతీలలో నూతనంగా మంజూరైన సీకేడీసీ పెన్షన్‌లను మలిశెట్టి బాలాజీ, ఆసోదివారిపాలేనికి చెందిన మంచాల పోలేరకు రూ.10 వేల పెన్షన్‌లను సోమవారం బాపట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.రవికృష్ణ, వెస్టుబాపట్ల పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వెస్ట్ బాపట్ల గ్రామ టీడీపీ అధ్యక్షులు సమ్మెట మల్లికార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులతో స్నేహపూర్వకంగా ఉండాలి

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవి రోగుల పట్ల స్నేహపూర్వక భావన కలిగి ఉండాలని సీఫార్డ్ డైరెక్టర్ కె.రవిప్రదీప్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం బాపట్లలో సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఫార్డ్ డైరెక్టర్ కె.రవిప్రదీప్ మాట్లాడుతూ హెచ్ఐవి రోగులలో మానసిక ధైర్యాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ బడుగు కిషోర్, మర్రిపల్లి నాగరాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ చర్యలు, సమాజంలో అవగాహన ఎంతముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు ఎన్.వినోద్, ఈ.గౌతమి పాల్గొన్నారు.

● నగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్వీఆర్ఎం కళాశాల నగరంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, రెడ్‌రిబ్బన్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఆర్.ప్రసన్నబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎంవీ శివయ్య, రెడ్‌క్రాస్, రెడ్‌రిబ్బన్ కోఆర్డినేటర్ యూ.గోపికృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్ వి.సాంబమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

పిట్టలవానిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం రైతుసేవాకేంద్రాన్ని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా సోమవారం సందర్శించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులకు అందజేసిన టార్పాలిన్ పట్టాలు, అలాగే రైతులకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అందజేసిన ధాన్యం గోతాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సహాయకురాలు నాగలక్ష్మి, ఎంఆర్ఐ కె.శ్రీనివాసరావు, దండు శివరామరాజు పాల్గొన్నారు.

మండలంలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీ శివారు రామనగర్ (ఏటికట్ల) గ్రామంలో సోమవారం బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా తెనాలి డ్రెయిన్ సందర్శించి పరిశీలించారు. పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావును ఈ ప్రాంతంలో తెనాలి డ్రెయిన్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ కె.శ్రీనివాసరావు, వీఆర్వో పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక గీతా పారాయణం

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హైందవి ఫౌండేషన్ బాపట్ల పట్టణ కన్వీనర్ మామిడి రాజశేఖర్ ఆధ్వర్యంలో గీతాజయంతి సందర్భంగా సోమవారం సూర్యలంక బైపాస్‌లో ఉన్న వీ కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో బ్రహ్మశ్రీ దుర్భాల ప్రభాకర్ శర్మ ప్రధాన వక్తగా పట్టణంలోని 20 పాఠశాలల నుంచి 960 మంది విద్యార్థులు పాల్గొని సామూహికంగా యువ గీతశత శ్లోకాలు పారాయణం చేశారు. కార్యక్రమంలో వాసుదేవరావు, దశరథమహరాజు, అంబటి మురళి, కళ్ళం హరినాథరెడ్డి, చాపల సుబ్రహ్మణ్యం, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, బాబు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత గ్రంథం ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. సోమవారం కొల్లూరులోని నిమ్మలపల్లివారి రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గీతా జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల మహిళా కన్వీనర్ గళ్లా ధనలక్ష్మి, ధర్మ విస్తారక్ చిట్టా రాములు, నిమ్మలపల్లి మల్లికార్జునరావు, బలరామమూర్తి, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుచ్చెళ్లపాడు రామాలయంలో సోమవారం గీతా జయంతి వేడుకను నిర్వహించారు. అనంతరం భజన కీర్తనలు ఆలపించి సామూహిక దీప హారతులు సమర్పించారు.

● వేమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో గీతాజయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని జంపని గ్రామంలో గీతా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. జ్ఞానవేదిక సభ్యులు టీవీ కృష్ణారావు, బి.శివలింగం, నాయక్ జె.హరిబాబు, శివరామకృష్ణ, మౌనిక, షేక్ దిల్షాద్, ఎ.శ్రీలక్ష్మి, వి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముళ్ళపూడినారాయణ శాస్త్రి మెమోరియల్ ఓరియంటల్‌హైస్కూల్లో సోమవారం జరిగిన భగవద్గీత పోటీల్లో వివిధ విభాగాల్లో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హరి అన్నయ్యశాస్త్రి, అచ్యుతుని శేషతల్పసాయి, కొమ్మూరి రాధాకృష్ణమూర్తి, లక్ష్మణశర్మలు పలువురు పాల్గొన్నారు.



క్రాపలో రైతుల సమస్యలు వింటున్న జేసీ భావన, ఆర్డీవో రామలక్ష్మి

ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం సేకరిస్తాం : జేసీ

కొల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎవరూ అధైర్యపడవద్దని ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం సేకరిస్తామని జాయింట్ కలెక్టర్ భావన రైతులకు భరోసా ఇచ్చారు. సోమవారం మండల పరిధిలోని క్రాప రైతు సేవా కేంద్రాన్ని జేసీ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఆమెను కలుసుకుని నూర్పిడి చేసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వ మద్దతు ధరకు తమ నుంచి కొనుగోలు చేయాలని కోరారు. స్పందించిన జేసీ వర్షాలు తగ్గుముఖం పట్టాయని, ధాన్యం పూర్తిగా ఆరబెట్టుకుంటే ఇక్కడే రైతు సేవ కేంద్రం ద్వారా ధాన్యం సేకరిస్తామన్నారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి బుష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విజయబాబు జన్మదిన వేడుకలు

వేమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వేమూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు బాపట్ల పార్లమెంటరీ స్థాయి పార్టీ అధికార ప్రతినిధి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు జన్మదిన వేడుకలను మంగళవారం వేమూరులో ఘనంగా నిర్వహించనున్నారు. ఎన్టీఆర్ పురవేదిక వద్ద ఉదయం జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపాయి.

జీఎస్‌డబ్ల్యూ అధికారిగా మల్లికార్జున

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల జీఎస్‌డబ్ల్యూ అధికారిగా బి.మల్లికార్జున సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చుండూరు మండలం, అంబేద్కర్‌నగర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయన డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొంది భట్టిప్రోలు మండలానికి బదిలీపై వచ్చారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీలత

కొల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ ఎంపీడీవోగా కె.శ్రీలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చేబ్రోలు మండలం, శలపాడు గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కొల్లూరు ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శ్రీలత విధుల్లో చేరారు. తొలుత ఎంపీడీవో నరసింహారావును మర్యాద పూర్వకంగా కలుసుకుని ఆర్డర్ కాపీని అందజేశారు. ఎంపీడీవో పాటు కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

చెరుకుపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా అబ్దుల్ రెహ్మాన్

చెరుకుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా అబ్దుల్ రెహ్మాన్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన వేమూరు నియోజకవర్గం జంపని గ్రామపంచాయతీ సెక్రటరీగా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీపై వచ్చారు.

బాపట్ల జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా యార్లగడ్డ

నగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా యార్లగడ్డ చింతయ్యను నియమిస్తున్నట్లుగా జిల్లా అధ్యక్షుడు కె.బంగారుబాబు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. చింతయ్య మండలంలో, జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహానికి శంకుస్థాపన

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుపై బాపట్ల-చీరాల జాతీయ రహదారి జంక్షన్ వద్ద శంకుస్థాపన కార్యక్రమాన్ని సోమవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జి నాగోతు రమేష్‌నాయుడు నిర్వహించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, సీనియర్ నాయకులు పోతుల సురేష్, రమణబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గొలుసు చోరీ తేల్చాలని ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆందోళన

కొల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మణప్పురం సంస్థలో పని చేస్తున్న ఓ యువకుడి బంగారు గొలుసు చోరీ విషయం తేల్చాలని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పోలీసుల వరకు వెళ్లడంతో సీఐ పివి అంజనేయులు బాధిత యువకుడు, కార్యకర్తలతో చర్చించి సంస్థ మేనేజర్‌పై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని చెప్పగా బాధిత యువకుడు పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందించాడు. ఫిర్యాదుపై విచారణ చేయాలని సీఐ పీఎస్ఐ శ్రీనివాస్‌కు పురమాయించారు.

సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గోవాడలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.30 లక్షలతో నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యం అన్నారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, సర్పంచ్ మండవ విజయలక్ష్మి, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరబోసిన ధాన్యం పరిశీలన

గ్రామంలో ఒక రైతు ఆరబోసిన ధాన్యంను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పరిశీలించారు. ఈసందర్భంగా ఎందుకు ధాన్యంను ఆరబోయాల్సి వచ్చిందని రైతును అడిగి తెలుసుకున్నారు. వాతావరణం అనుకూలంగా లేనందును ప్రభుత్వం ద్వారా ధాన్యంను అమ్ముకోవాలని రైతుకు సూచించారు.

5న మెగా పీటీఎం 3.0

● అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నిర్వహణ ● తల్లిదండ్రులతో పిల్లల ప్రగతి పై చర్చ



నరసరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 3.0 కార్యక్ర మాన్ని డిసెంబరు 5న నిర్వహించనున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్ కేజీబీవీ, గిరిజన, సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో పీటీఎం జరగనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రభుత్వ విద్యాసంస్థలో తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్ పర్సన్లు, సభ్యులు, అధికారులు అందరూ పాల్గొంటారు.

● పిల్లల ప్రగతిపై చర్చ

పీటీఎంలో పిల్లల ప్రగతిపై చర్చ జరుగుతుంది. ప్రతి ఒక్క స్కూల్లో పిల్లల అకడమిక్ అభివృద్ధి, గత కొన్ని నెలల్లో వారు స్కూల్లో నేర్చుకున్న అకడమిక్స్ వివరాలు, వారి ప్రోగ్రెస్ కార్డ్, మార్కులు తల్లిదండ్రులతో చర్చిస్తారు. ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సభ్యులు తల్లిదండ్రులతో కలిసి స్కూల్ అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఒక్కొక్క స్కూల్‌కు హాజరు కావాలని, అందుకు సంబంధించిన మ్యాపింగ్ కూడా జరుగుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి, విద్యార్థుల విద్యా స్థాయిపై తల్లిదండ్రులకు అవగాహనకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. పీటీఎంను ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామన్నారు.

● హోలీస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టుల అందజేత

ఈ కార్యక్రమంలో విద్యార్థుల హోలీస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేస్తారు. చిన్న పిల్లలకు చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి వాటిపై అవగాహన ఉందా లేదా అనే అంశాలు తల్లిదండ్రులతో చర్చిస్తారు. తదుపరి మూడు నెలల క్యాంపెయిన్ కింద ఎఫ్ఎల్ఎన్ లెర్నింగ్‌ను ముందుకు తీసుకెళ్లే కార్యాచరణ కూడా వివరిస్తారు. డిసెంబరు 5 నాటికి 10వ తరగతి సిలబస్ చాలా వరకు పూర్తవుతుంది. ఆ తర్వాత 100 రోజుల ఇంటెన్సివ్ యాక్షన్ ప్లాన్ గురించి తల్లిదండ్రులతో చర్చిస్తారు. విద్యార్థులు ఆరోగ్య స్థితిగతులపై తల్లిదండ్రులకు తెలియజేస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. అనంతరం విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి డొక్కా సీతమ్మ భోజన కార్యక్రమంలో సహపంక్తి భోజనాన్ని చేయనున్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రి తమ పిల్లలతో పాటు ఈ మెగా పీటీఎంకు తప్పకుండా హాజరు కావాలని, అప్పుడే వారికి తమ పిల్లల ప్రోగ్రెస్ గురించి అవగాహన కలుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఇళ్లులేని గ్రామీణ పేదలకు గృహ నిర్మాణ సహాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గత నెల 30వ తేదీతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ పథకం గడువు ముగిసినప్పటికీ ఆ గడువును మరో 14 రోజులు అదనంగా పెంచింది. దీంతో అర్హులైన పేదలకు గృహ నిర్మాణ సహాయం పొందేందుకు మరో అవకాశం లభించినట్లయింది.



పీఎంఏవై గడువు పొడిగింపు

● మరో 14 రోజులు పొడిగించిన ప్రభుత్వం
● సచివాలయ సిబ్బందితో విస్తృత స్థాయిలో సర్వే
● అర్హులైన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్చడమే లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించి వారిని పీఎంఏవై పరిధిలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గుంటూరు జిల్లాలో 15 వేల మంది, బాపట్ల జిల్లాలో 25 వేల మంది, పల్నాడు జిల్లాలో 50 వేల మంది ఈ పథకం పరిధిలోకి వస్తారని గృహనిర్మాణ శాఖ అధికారులు అంచనా వేశారు. పీఎంఏవై 2025 గ్రామీణ పథకం 2028-29 వరకూ అమలు కానున్న నేపథ్యంలో ఆలోపు మళ్లీ గృహ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. అందువల్ల ఇప్పుడే వీరందరినీ ఈ పథకం పరిధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఈ ప్రక్రియ పూర్తికాలేదు. నవంబరు నెలాఖరునాటికి గుం టూరు జల్లాలో 10వేలు, బాపట్ల జిల్లాలో 18,500, పల్నా డు జల్లాలో 25వేల మందికి పైగా పీఎంఏవై గ్రామీణ పథకం పరిధిలోకి వచ్చారు. మిగిలినవారిని కూడా ఈ పరిధిలోకి తీసుకురావాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు.

● సచివాలయ సిబ్బందితో సర్వే..

ఇళ్లు లేని గ్రామీణ ప్రాంత పేదలు భారీ సంఖ్యలో ఉన్నప్పటికీ వారిలో మెజారిటీ ప్రజలకు స్థలం లేదు. అలాంటివారిని కూడా పథకం పరిధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సచివాలయ ఉద్యోగులతో సర్వే చేపట్టి, ఇంటి స్థలం లేనివారితో కూడా పీఎంఏవై పథకానికి దరఖాస్తు చేసుకునేలా చేసింది. అయితే ఈ ప్రక్రియ నవంబరు నెలాఖరు నాటికి పూర్తి కాకపోవడంతో మరో 14 రోజులు గడవును పొడిగించింది. అర్హులను గుర్తించి, వారిని తక్షణం పీఎంఏవైకి దరఖాస్తు చేసుకునేలా సచివాలయ ఉద్యోగులను పరుగులు పెట్టిస్తోంది.

● గృహ రుణ సదుపాయం ఇలా..

పీఎంఏవై పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.2,50,000 రుణం అందజేస్తున్నాయి. ఇందులో కేంద్రం వాటా రూ. 1.50 లక్షలు కాగా రాష్ట్రం వాటా రూ.లక్షగా ఉంటుంది. దీన్ని నాలుగు దశల్లో అందజేస్తారు. దీంతోపాటు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కన్వర్జెన్స్ కింద 90 రోజుల కూలీ, టాయిలెట్ నిర్మాణం కోసం ఇచ్చే రూ. 12వేలు కలిపి మొత్తం 39 వేలు అదనంగా ఇవ్వనున్నారు. స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికిపైన ప్రకటించిన ఆర్థిక సహాయం అందజేస్తారు. ఇంటి స్థలం లేనివారికి 3 సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇల్లు నిర్మించుకునేందుకు సహాయం అందజేస్తారు.

● ఆర్థిక సహాయం ఇలా..

నిర్మాణ దశ	నిధుల విడుదల
పునాది దశ	రూ. 60,000
గోడల దశ	రూ. 60,000
స్లాబ్ దశ	రూ. 60,000
తుది దశ	రూ. 70,000
మొత్తం	రూ.2,50,000

● కావాల్సిన పత్రాలు..

ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్ లింకైన బ్యాంకు పాస్‌బుక్, స్థలం ఉంటే భూమి పట్టా, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మొబైల్ నెంబరు.

షట్‌డౌన్..!

● తుఫాన్ ప్రభావాల పేరిట బీచ్‌ల మూసివేత
● సన్నద్ధత ఉండాలే గాని... నిషేధం ఏంటనే ప్రశ్నలు
● పర్యాటకరంగంపై తీవ్ర ప్రభావం
● వందల మంది ఉపాధిపై పరోక్షంగా దెబ్బ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తుఫాన్ హెచ్చరికలు రాగానే తొలి వేటు పర్యాటకంపైనే పడుతోంది. ఇటీవల విరుచుకుపడిన మొంథా తుఫాన్ కానీ, ప్రస్తుతం దిత్వా విషయంలో కానీ జరుగుతున్నది ఇదే. అప్రమత్తం పేరిట ఏకంగా తీరప్రాంతంలో పర్యాటకులకు అనుమతి లేదనే ఆదేశాలు జారీ చేయడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ముఖ్యంగా సన్నద్ధతకు, నిషేధానికి మధ్య ఉన్న తేడాను గుర్తించడంలో యంత్రాంగం గాడి తప్పుతోందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

● మరో గోవాగా విరాజిల్లడానికి అవకాశం

జిల్లాలో సుదూర తీర ప్రాంతం ఉంది. పర్యాటకంగా మరో గోవాగా విరాజిల్లడానికి బాపట్ల జిల్లాకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వారాంతాల్లో బాపట్ల, చీరాల బీచ్‌లకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కొంచెం ప్రభుత్వం వైపు నుంచి ప్రోత్సాహం ఇస్తే పర్యాటక రంగంలో గణనీయంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా అభివృద్ధికి టూరిజం గ్రోత్ ఇంజన్‌లా ఉపయోగపడనుందని పాలకులు పలు వేదికలపై ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులతో సంబంధం లేకుండా బీచ్‌ల విషయంలో అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు విమర్శలకు దారి తీస్తున్నాయి.

● వరుస ప్రమాదాలతో భయాందోళన
● స్త్రీ శక్తి పథకంతో మరింత పెరిగిన రద్దీ

● కీలకమైన కార్తికమాసంలో...

జిల్లాలో ఉన్న సూర్యలంక, రామాపురం, ఓడరేవు బీచ్‌లకు పవిత్ర కార్తికమాసంలో లక్షల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు పోటెత్తుతుంటారు. అదే సమయంలో మొంథా విరుచుకుపడిన సంగతి తెలిసిందే. తుఫాన్ ప్రభావం తగ్గిపోయిన తర్వాత వారం రోజుల వరకు కూడా జిల్లాలో బీచ్‌లు మూసివేసే ఉన్నాయి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో గోతులు ఏర్పడ్డాయని, పర్యాటకులకు అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అప్పుడు అధికారులు చెప్పారు. సాంకేతికంగా ఇందులో వాస్తవం ఉన్నా, తగు జాగ్రత్తలతో కనీసం జల్లు స్నానాలకు అయినా అనుమతిస్తే పవిత్రమైన కార్తికపౌర్ణమి తీరంలో వైభవంగా జరిగి ఉండేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. ఇప్పుడు తాజాగా దిత్వా ప్రభావంతో ఓ వైపు చిరుజల్లులు మాత్రమే అది, సోమవారాల్లో జిల్లా వ్యాప్తంగా కురిశాయి. కానీ ముందస్తు జాగ్రత్తల పేరిట తీరప్రాంతంలో పర్యాటకులకు అనుమతి లేదనే నిర్ణయం తీసుకున్నారు.



● ఆ స్థాయి తీవ్రత లేకుండానే..

పర్యాటకుల భద్రతకే తొలి ప్రయారిటీ. ఇందులో రెండో అభిప్రాయానికి అవకాశం ఉండకూడదు. కానీ ఆ స్థాయి తీవ్రత లేకుండానే ఏకంగా రోజుల తరబడి బీచ్‌ల మూసివేత నిర్ణయాలు తీసుకోవడమే తప్పుబట్టదిగా ఉంది. తుఫాన్‌లు జిల్లా పరిధిలో తీరం దాటడం సందర్భాలు మినహాయిస్తే మిగిలిన వేళల్లో ఎక్కువ శాతం భారీ వర్షాలకే ఆస్కారం ఉంటుంది. ఒక వేళ అంచనాలకు మించి వర్షాలు కురిస్తేనో లేక ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటేనో నాలుగైదు గంటల ముందు ఆ తీవ్రతను బట్టి బీచ్‌లు ఖాళీ చేయించే సన్నద్ధత మన వ్యవస్థలకు లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. తుఫాన్ ప్రభావం అనగానే పర్యాటకుల ప్రవేశంపై నిషేధం విధిస్తే మేలనే అభిప్రాయానికి రావడం అంటే ఓ విధంగా బాధ్యతల నుంచి తప్పుకోవడమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి

● ఇలా అయితే పర్యాటకం కష్టమే...

ఏడాదిలో పదుల సంఖ్యలో తుఫాన్‌లు జిల్లాను పలకరిస్తుంటాయి. కొన్ని తీవ్రతతో, మరికొన్ని నామమాత్రంగా ప్రభావం చూపు తుంటాయి. ప్రతిసారీ బీచ్‌ల మూసివేత నిర్ణయం తీసుకుంటే పర్యాటకం అభివృద్ధితో పాటు స్థానికంగా వందల మంది ఉపాధిపై దెబ్బ పడుతోంది. తీర ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను మరింతగా పెంచే చర్యలపై దృష్టి పెట్టాలి అంతే కానీ ముందస్తు జాగ్రత్తల పేరిట తీరప్రాంతాన్ని మూసివేయడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

బకాయి భారం

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలి. ఒక్క గుంటూరు కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రూ.25.03 కోట్లు బకాయిలున్నాయి. గుంటూరులో ప్రభుత్వ కళాశాలకు సంబంధించి రూ.2.98 కోట్లు ఆస్తి పన్ను బకాయి 2019 నుంచి చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నుంచి రూ.1.73 కోట్లు 1993 నుంచి బకాయి ఉంది. తెనాలి మునిసిపాల్టీలో రూ.1.98 కోట్లు, మంగళగిరి - తాడేపల్లిలో రూ.1.42 కోట్లు, పొన్నూరు మునిసిపాల్టీలో రూ.60 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

కోర్టు కేసుల్లో ఆస్తి పన్ను వివాదాలు

ఆస్తి పన్ను విధించడంలో లోపాలను సవరించాలని భవన యజమానులను కోర్టులను ఆశ్రయించారు. దీంతో ఆయా భవనాలకు సంబంధించి పన్ను వసూలు నిలిచిపోయింది. పిటిషన్ దారులు పేర్కొన్న అంశాలను పరిష్కరించి కోర్టులో కేసులు ఉపసంహరించు కొనే దిశగా అధికారుల చర్యలు లేవు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే కేసుల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపడితే పెద్ద ఎత్తున పన్ను వసూలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. మూడు జిల్లాల్లో రూ.19.02 కోట్లు కోర్టు వివాదాల వల్ల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. గుంటూరు జిల్లాలోని కార్పొరేషన్‌తో సహా మునిసిపాల్టీల్లో రూ 7.52 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ 9.73 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 1.77 కోట్లు బకాయిలు ఉన్నాయి. తెనాలి మునిసిపాల్టీలో 31 కేసుల వల్ల రూ2.98 కోట్లు పన్ను వసూలు నిలిచిపోయింది. గుంటూరు కార్పొరేషన్‌లో 66 కేసులు కోర్టుల్లో ఉన్నాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీలో రూ.9.58 కోట్లు కోర్టు వివాదాల వల్ల బకాయిలు ఉన్నాయి. 6,045 అసెస్‌మెంట్‌లకు సంబంధించి కోర్టులలో పిటిషన్‌లు దాఖలయ్యాయి. కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించుకొని ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయడంతో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

డిసెంబరు 20న శ్రీనివాసుని కల్యాణం

పిడుగురాళ్లలో స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన శ్రీనివాసుని కల్యాణం పిడుగురాళ్లలో నిర్వహించనున్నామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం టీటీడీకి చెందిన మల్లికార్జునరావు, మరికొంత మంది అధికారులతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని స్థానిక జడ్పీ హైస్కూల్, కన్యకాపరమేశ్వరి దేవాలయం ముందు ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని విలేకరులతో మాట్లాడుతూ, 2014-19 మధ్య కాలంలో పిడుగురాళ్లలోని జడ్పీ స్కూల్‌లో ఒకసారి శ్రీనివాసుని కల్యాణం నిర్వహించామని, ఇప్పుడు రెండోసారి జరుపనున్నామన్నారు. అనంతరం గురజాల పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల పత్రికలను ఎమ్మెల్యే యరపతినేని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గురజాల డీఎస్పీ జగదీష్, మున్సిపల్ చైర్మన్ కెవి.సుబ్బారావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, యేలూరి చంద్రశేఖర్, కనిగిరి శ్రీను, కొత్త రఘురామయ్య, పాండురంగ శ్రీను, జూలకంటి సుబ్రహ్మణ్యం, పసుమర్తి సుబ్రహ్మణ్యం, గుండా రామారావు, లఘువరపు రామనాథం, కొత్త శివయ్య, యేలూరి శశికుమార్, కొలిశెట్టి సుబ్బారావు, కొత్తూరి ఆంజనేయులు, చందోలు రామకృష్ణారావు, వివి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

బస్టాండ్‌లో...అటో..ఇటో..ఎటో...

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లలో ప్రయాణికుల రాకపోకలు గందరగోళంగా మారాయి. ప్రయాణికులు ఎటు వెళుతున్నారో.. ఎటు నుంచి ఏ బస్సు వస్తుందో, ఏం ప్రమాదం జరుగుతుందో అనే పరిస్థితులు నెలకొన్నాయి. కనీస సూచికలు లేకపోవటంతో పాటు ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల గుంటూరు బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు కింద పడి మృతి చెందగా.. తాజాగా ఓ విద్యార్థినిని విజయవాడ సెక్టార్‌లో బస్సు ఢీ కొంది. ఈ పరిస్థితులలో ఎటు నుంచి ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్టాండ్‌లపై అధికారుల అలసత్వం, కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక బస్టాండ్‌లలో రద్దీ రెట్టింపయింది. ఇక పండగలు, ఆదివారం వంటి సెలవు దినాల్లో రద్దీ మరింత అధికంగా ఉంటోంది.

● బస్సులో సీటు కోసం పాట్లు

స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక మహిళల రద్దీ బాగా పెరిగింది. మహిళలు 80 శాతం ఉంటే పురుషులు 20 శాతం వరకు ఉంటున్నారని సిబ్బంది చెబుతున్నారు. బస్టాండ్‌లలో ప్లాట్‌ఫాం వరకు బస్సు రాకముందే సీటు కోసం ప్రయాణికులు బస్సుకు ఎదురెళ్తున్నారు. ఆ సమయంలో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని డ్రైవర్‌లు, కండక్టర్‌లు ఆందోళన చెందుతున్నారు. కనీసం ప్రయాణికులను అదుపు చేసేందుకు బస్టాండ్‌లో కంట్రోలర్స్ కొరత ఉందని చెబుతున్నారు. గతంలో ఉన్న హోంగార్డులను తొలగించారు. దాంతో బస్టాండ్‌లలో పరిస్థితులను అదుపు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇక ప్రైవేటు వాహనాలు కూడా హల్‌చల్ చేస్తున్నాయి. బస్టాండ్‌లలో ప్రయాణికుల రద్దీ అదుపు చేయటంతో పాటు మౌలిక వసతులపై ప్రజా రవాణాధికారులు దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సుల్లో సీట్ల కోసం పోటీపడుతున్న ప్రయాణికులు



బస్టాండ్ ప్రాంగణంలో గందరగోళంగా ప్రయాణికుల రాకపోకలు

విద్యార్థులు మస్క్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెస్లా ఫౌండర్ ఎలాన్ మస్క్‌ను, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పది రోజుల క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, బీటెక్ చదివిన విద్యార్థులలో చాలా కాంపిటీషన్ ఉందని వాటిని అధిగమించి ఉద్యోగ అవకాశాలు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ లింగరాజు మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని, వర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం డ్రీమ్ ప్యాంట్ ట్రైనింగ్ సొల్యూషన్స్ సీఈవో శ్రీధర్ జలపాటితో పాటు ఇంగ్లీష ట్రైనర్ గోపీ, ఆప్టిట్యూడ్ ట్రైనర్ హరిశంకర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ప్రోగ్రాం మేనేజర్ సాయి కిరణ్‌ను యూనివర్సిటీ యాజమాన్యం శాలువాతో సత్కరించి మెమెంటోను బహుకరించారు. వర్సిటీ అధికారులు శిక్షణ తీసుకున్న విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ రామినేని శివరాం ప్రసాద్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, అతిథి అధ్యాపకులు కె.పృథ్వీరాజ్, సాంకేతిక నిపుణులు అజయ్, కోడూరు కనకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ప్రజా ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమం

ఎమ్మెల్యే దామచర్ల
నగరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా కూటమి ప్రభుత్వంలోనే పేదల సంక్షేమం సాధ్యపడుతుందని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం ఒంగోలులోని 12వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోపే ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ అమలు చేసినట్లు తెలిపారు. అందులో ప్రధానమైన పింఛన్ల పెంపుపై తొలి సంతకం చేశారన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులతోపాటు ట్రాన్స్ జెండర్‌లకు పింఛన్ పెంచి అండగా నిలుస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, అయితే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే వెయ్యి రూపాయలు పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాత, కమిషనరు కే. వెంకటేశ్వరరావు, మైనార్టీ కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ కపిల్ బాషాతోపాటు స్థానిక కార్పొరేటర్ అంబూరి శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు.


ఒంగోలులో దివ్యాంగునికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

సామాజిక పెన్షన్ల పంపిణీ

మద్దిపాడు :అర్హులైన పేదలకు సామాజిక పెన్షన్ అందించడంలో అధికారులు నిరంతరం కృషిచేయాలని రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంతి బాబు అన్నారు. సోమవారం మద్దిపాడు ఘడియపూడి కాలనీలో ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. దొడ్డవరప్పాడులో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి, కొలచనకోట గ్రామంలో దేవబత్తిన ప్రసాద్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పలువురు తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

92 శాతం పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను సోమవారం సాయంత్రానికి 92 శాతం పంపిణీచేసినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 6,672 మంది వివిధ పెన్షన్లకు సంబంధించి 6,091 మందికి పంచాయతీ, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ద్వారా అందించినట్లు ఎంపీడీవో తెలిపారు. మిగతావారికి రేపటిలోపు అందజేస్తామన్నారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నీటిసంఘం అధ్యక్షుడు అబ్బూరిశ్రీను, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం పూర్తి

నాగులుప్పలపాడు :మండల పరిధిలోని గ్రామాలలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తిచేసినట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గ్రామాలలో అధికారులు, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.నాగులుప్పలపాడులో మండల ప్రత్యేకాధికారి గంగవరపు జోసఫ్‌కుమార్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.


ఘడియపూడిలో పెన్షన్ అందజేస్తున్న పొగాకు సమాఖ్య రాష్ట్ర చైర్మన్ మండవ జయంతిబాబు

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ


విద్యార్థులతో మాట్లాడుతున్న పొన్నలూరు వైద్యాధికారి మల్లికార్జునరావు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈర్యాలీని స్థానిక కలెక్టరేట్ వద్ద నుంచి ఐఎంఏ హాలు వరకు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సుకు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ. నాగయ్య నాయుడు, డాక్టర్ ఆనంద్‌లు అధ్యక్షత వహించారు. అనంతరం సభలో హెచ్ఐవీ నియంత్రణకు తీసుకోవాల్సిన పలు చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ కే సుధాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ జాలాది మణిబాబు, పూర్వ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నే వీరయ్య చౌదరి, డాక్టర్ జయశేఖర్, ఏపీఎంసీ చైర్మన్ డాక్టర్ కే సుబ్బానాయుడు, డాక్టర్ శివ సీతారామయ్య, డాక్టర్ జాకబ్ జక్కరయ్య, డాక్టర్ శార, డాక్టర్ రాధిక, డాక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, డాక్టర్ మాల కొండారెడ్డి, డాక్టర్ కృష్ణ, జి. రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

అవగాహన పెంచుకోవాలి

సింగరాయకొండ : హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం సింగరాయకొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అసురక్షిత శృంగారం, రక్తమార్పిడి వంటి పలు కారణాలు వలన హెచ్ఐవీ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. వ్యాధి పట్ల కొంతమందిలో ఉండే అపోహలు, సందేహాలు శారీరకంగానూ, మానసికంగానూ కుంగదీస్తుంటాయని తెలిపారు. వీటిని తొలగించడానికి వైద్యులను సంప్రదించి వ్యాధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వంశీధర్, రవి, కలైసెల్వం, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ హెచ్ఐవీకి కారణాలు, నిరోధానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణచైతన్య, రవికిరణ్, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

మద్దిపాడు : స్థానిక కడియాల యానాదయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్ , పీడీ ఆదినారాయణ, లెక్చరర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీని తరిమికొట్టాలి

ఒంగోలు విద్య : సమాజంలో మహమ్మారిగా మారిన ఎయిడ్స్ భూతాన్ని తరిమి కొట్టాలని ఒంగోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. కళ్యాణి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు హెచ్ఐవీపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈర్యాలీని ప్రిన్సిపాల్ కళ్యాణి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ కే ప్రతాప్, ఎం. శ్రీనివాసరావు, అధ్యాపకులు మౌనిక, అరుణకుమారి, విద్యార్థినులు ఉన్నారు.

హడలెత్తించిన చైన్‌స్నాచర్

వరుసగా రెండు ప్రాంతాలలో చోరీ
సీసీ ఫుటేజీ సేకరణలో పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో బంగారం గొలుసులు లాక్కెళుతూ ఓ దొంగ హడలెత్తించాడు. సోమవారం రాత్రి దేవాలయం సమీపంలో ఇరువురు మహిళల మెడలలో గొలుసులు లాక్కెళ్లాడు. లాయర్‌పేట సాయిబాబా గుడి సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న మందాడి కోటేశ్వరమ్మ అదే ప్రాంతంలో గూడూరి గుప్తాస్ అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది. ఆమె సాయిబాబా గుడికి వెళ్లి నడుచుకుంటూ అపార్ట్‌మెంట్‌కు వెళుతుండగా ఎదురుగా వచ్చిన 35 ఏళ్ల యువకుడు ఆమె మెడలో ఉన్న గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే అక్కడ సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు పోలీసులు. అదే సమయంలో ఆగంతుకుడు రంగారాయుడు చెరువు సమీపంలోని అయప్పస్వామి గుడి సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న కొల్లిపర శారద మెడలో బంగారం చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు రెండు కేసులు నమోదుచేసుకొని ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు ప్రాంతాలలో పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అయితే రెండు ప్రాంతాలలో గొలుసులు లాకెళ్లింది ఒక్కడే ఆగంతుకుడు అయి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

ఆటోలో 14 సవర్ల బంగారం అపహరణ

మద్దిపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ వద్ద 14 సవర్ల బంగారం అపహరించుకుపోయారు. ఈ సంఘటన సోమవారం రాత్రి మద్దిపాడులో చోటుచేసుకుంది. తెల్లబాడు గ్రామానికి చెందిన మల్లిపెద్ది ధనలక్ష్మి ఆమె సోదరి నర్రా సుకన్య పిడుగురాళ్ల నుంచి బస్సులో వచ్చి మద్దిపాడులో దిగారు. అక్కడి నుంచి తెల్లబాడు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. వీరితో పాటు మరో ఇద్దరు మహిళలు ఆటో ఎక్కారు. వీరు వెల్లంపల్లి జాతీయ రహదారిపై దిగిపోయారు. ఇంటికి వెళ్లిన అనంతరం ధనలక్ష్మి, సుకన్యలు బ్యాగు పరిశీలించగా అందులో ఉన్న 14 సవర్ల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో మధ్యలో దిగిపోయిన వారు తస్కరించి ఉంటారని భావించి వెంటనే మద్దిపాడుకు వచ్చి ఎస్ఐ వెంకటసూర్యకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు స్మార్ట్‌జన్ విద్యార్థి ఎంపిక

సింగరాయకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సింగరాయకొండ స్మార్ట్‌జన్ జూనియర్ కళాశాలకు చెందిన డి.భావేష్ ఎంపికయ్యారు. ఈనెల 5,6,7 తేదీల్లో గుంటూరులో నిర్వహించే అండర్-19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో భావేష్ పాల్గొననున్నారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి, అధ్యాపకులు అభినందించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సూర్యనారాయణ

కొండపి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ ఎంపీడీవో (గ్రామ, వార్డు సచివాలయాల శాఖ)గా నల్లమల్లి సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని సచివాలయాల సిబ్బంది ఇకపై ఆయనకు జవాబుదారీగా పనిచేయాల్సి ఉంటుందని మండల పరిషత్ కార్యాలయ ఏవో రామకృష్ణ తెలిపారు.

గీతపారాయణం చేసిన భక్తులు


పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గీత జయంతి సందర్భంగా సోమవారం యద్దన పూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నారాయణం శ్రీనివాసాచా ర్యులు ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామిని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత మహిళా భక్తులు గీత పారాయణం చేశారు. ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవాల్సిన అవసరం ఉందన్నారు.

చినగంజాం ఎంపీడీవో కారును
ఢీకొన్న మరో కారు

● డ్రైవర్‌కు, వెనుక ఉన్న కారులోని కారంచేడు వైద్యుడికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న పోలీసులు

నాగులుప్పలపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆపి పరిశీలిస్తున్న చినగంజాం ఎంపీడీవో కారును వెనక నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ఘటన ఒంగోలు-చీరాల జాతీయ రహదారిపై మద్దిరాలపాడు వద్ద చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు.. చినగంజాం ఎంపీడీవో ధనలక్ష్మి సోమవారం రాత్రి విధులు ముగించుకొని తోటి కార్యాలయ సిబ్బందితో కలసి తన కారులో ఒంగోలు వెళుతున్న క్రమంలో చేకూరపాడు సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు మరమ్మతులకు గురైంది. దీంతో కారు డ్రైవర్ శివ రోడ్డు పక్కన ఆపి పరిశీలిస్తుండగా వెనక నుంచి వచ్చిన కారంచేడు పీహెచ్‌సీ వైద్యుడు గోరంట్ల సురేష్‌బాబు కారు ఎంపీడీవో కారును ఢీకొట్టింది. దీంతో శివ గాయపడటంతో చికిత్స నిమిత్తం 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఇక పీహెచ్‌సీ వైద్యుడు సురేష్‌బాబు ఛాతినొప్పితో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఎంపీడీవో ధనలక్ష్మి, ఆమె కార్యాలయ సిబ్బంది నిర్మల, హిమబిందు ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం సమయంలో అటుగా వెళ్తున్న మోటార్ సైకిలిస్ట్‌కు సైతం గాయాలైనట్లు సమాచారం.


క్విస్ కళాశాల ఆధ్వర్యంలో యరజర్లలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం

ముగిసిన సేవా కార్యక్రమాలు

ఒంగోలు విద్య, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత్ భారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు మండలం యరజర్లలో వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలు ముగిశాయి. ఈనెల 24వతేదీ నుంచి 30వతేదీ వరకు యరజర్ల గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రిదేవిలు తెలిపారు. విద్యార్థుల్లో సేవా భావం నింపేందుకు, గ్రామస్థుల అవసరాలను తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమాలు ఎంతోగానూ దోహదపడ్డాయన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో క్విస్ కళాశాల ఎన్ఎస్ఎస్ హెడ్ డాక్టర్ నవనీత్ కృష్ణ, పీవోలు శిరీష, వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ వాసుబాబు, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు.


సంతనూతలపాడులో క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ, సీఐటీయూ నేతలు

పెంచలయ్య కుటుంబానికి సాయం అందించాలి

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబానికి రూ.50లక్షల ఆర్థికసాయం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బంకాసుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పేర్నమిట్టలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో డీవైఎఫ్ఐ నాయకుడిగా ఉన్న పెంచలయ్యను హత్యచేసిన వారిపై అరెస్టు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ట్రెజరీ అధికారులు

ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ జనాభా, లెక్కలశాఖ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెజరీ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కాజా రాజ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ట్రెజరీ అధికారులు రాజ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్‌ను శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి వచ్చేందుకు సహకరించిన ట్రెజరీలోని వివిధ విభాగాల అసోసియేషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రెజరీలో అధికారుల నుంచి ఉద్యోగుల వరకు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీవోలు కెనడి, జే వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి, సుధీరా, శ్రీనాథ్, ఆంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


రాచవారిపాలెంలో గుండ్లకమ్మనది మ్యాపును పరిశీలిస్తున్న డీఆర్వో ఓబులేశు, ఆర్డీవో, ఇతర అధికారులు

నివేశన స్థలాల కేటాయింపునకు కృషి

మద్దిపాడు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని రాచవారిపాలెం అరుంధతి నగర్ వాసులకు నివేశన స్థలాల కేటాయింపునకు కృషిచేస్తానని డీఆర్వో ఓబులేశు చెప్పారు. నదికి వరద వచ్చినపుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారంటూ మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన మాదిగ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారని ఆయన ఆదేశాలతో సోమవారం అరుంధతినగర్‌ను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ అజయ్ కుమార్ రెడ్డి, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో బుల్లయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవహగాహన

ఒంగోలు క్రైం,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యువత బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేసి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కే .జయప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక హర్షిణి కాలేజీలో విద్యార్థులకు రహదారి భద్రతపై రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ యువకులు విద్యార్థులు రహదారి భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్ లేకుండా వాహన చోదన ప్రమాదాలకు కారణం అవుతాయన్నారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా వాహన చోదన చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ట్రాఫిక్ గుర్తులు పైకూడ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న వల్లూరమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు

వల్లూరమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

● మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
● ఘనంగా ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

వల్లూరు (కొండపి), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : వల్లూరమ్మ ఆలయ అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. సోమవారం టంగుటూరు మండలంలోని వల్లూరమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం చంద్రబాబుకు, ప్రజా ప్రభుత్వానికి వల్లూరమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా చైర్మన్ రియాజ్ పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బెల్లం జయంత్‌బాబు, ఈదర ప్రభాకర్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బొజ్జా శ్రీనివాసులు, సభ్యులు తుళ్లూరు వెంకటశేషమ్మ, వల్లూరి జ్యోతి, మొలకలపల్లి లక్ష్మీనారాయణ, వరికూటి సుమన్, అంబోరి అనూరాధ, తక్కెళ్లపాటి వెంకయ్య, సంగర రాజేష్, వారణాశి రామమూర్తి, బల్లిపల్లి మౌనిక, మొలకలపల్లి గీతాలక్ష్మి, బద్దిపూడి ఉమాశంకర్‌లతో ఈవో రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు.



సీపీఎం ఒంగోలు నగర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి మాబు

మహిళా మార్ట్ అక్రమాలపై విచారణ చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో మహిళా మార్ట్ పేరుతో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు డిమాండ్‌చేశారు. స్థానిక సుందరయ్య భవన్ సోమవారం జరిగిన సీపీఎం ఒంగోలు నగర కమిటీ సమావేశానికి నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాబు మాట్లాడుతూ మార్ట్ విషయంలో ప్రభుత్వం, జిల్లా అధికారుల నిర్లక్ష్యమే అవినీతికి కారణమని ఆరోపించారు. 2022లో మహిళా మార్ట్ పేరుతో పొదుపు సంఘాల సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.150 వంతున సుమారు రూ. 55 లక్షలు వసూలు చేశారన్నారు. ఆర్పీల వద్ద నుంచి ఏసీ, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని ఒక్కొక్కరి వద్ద నుంచి మూడువేలు వసూళ్ళు కలిపి మొత్తం రూ. 68 లక్షలు సేకరించినా ప్రస్తుతం ఖాతాలో కేవలం రూ. 27లక్షలు మాత్రమే ఉందన్నారు. ఇందులో భారీ అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు తంబి శ్రీనివాసులు, వీరస్వామి, ఎస్‌డీ హుస్సేన్, టి. మహేష్, బీవీ రావు, ఆదిలక్ష్మి ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులతో దళిత నేతలు

ఇంటిని కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని నెహ్రూకాలనీలో 20 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ఈద జాస్మిన్ ఇంటిని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన ధర్నాలో రవిశంకర్ మాట్లాడుతూ నెహ్రూకాలనీలో డీకే ప్రభుత్వ భూమిలో 20 ఏళ్ల నుంచి రేకుల షెడ్డువేసుకొని హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ స్థలానికి పన్ను, కరెంటు మీటర్ కూడా ఉందన్నారు. అయితే మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతరులకు కలిసి దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్ పెట్టి ఇంటిని కూల్చడం దుర్మార్గంగా ఉందన్నారు. అన్యాయంగా, దౌర్జన్యంగా ఇంటిని కూల్చివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం. వెంకట్, గణేష్, కృష్ణ, స్రవంతి, మల్లికార్జున, బాలమ్మ, చెన్నమ్మ, ఈద జాస్మిన్, రంగమ్మ, సుమలత, కావేరి, ఏసుదాసు, రమణ, సుబ్బయ్య ఉన్నారు.

బకాయి భారం

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలి. ఒక్క గుంటూరు కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రూ.25.03 కోట్లు బకాయిలున్నాయి. గుంటూరులో ప్రభుత్వ కళాశాలకు సంబంధించి రూ.2.98 కోట్లు ఆస్తి పన్ను బకాయి 2019 నుంచి చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నుంచి రూ.1.73 కోట్లు 1993 నుంచి బకాయి ఉంది. తెనాలి మునిసిపాల్టీలో రూ.1.98 కోట్లు, మంగళగిరి - తాడేపల్లిలో రూ. 1.42 కోట్లు, పొన్నూరు మునిసిపాల్టీలో రూ.60 లక్షలు బకాయి చెల్లించాల్సి ఉంది.

కోర్టు కేసుల్లో ఆస్తి పన్ను వివాదాలు

ఆస్తి పన్ను విధించడంలో లోపాలను సవరించాలని భవన యజమానులు కోర్టులను ఆశ్రయించారు. దీంతో అయా భవనాలకు సంబంధించి పన్ను వసూలు నిలిచిపోయింది. పిటిషన్ దారులు పేర్కొన్న అంశాలను పరిష్కరించి కోర్టులో కేసులు ఉపసంహరించు కొనే దిశగా అధికారుల చర్యలు లేవు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే కేసుల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపడితే పెద్ద ఎత్తున పన్ను వసూలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. మూడు జిల్లాల్లో రూ.19.02 కోట్లు కోర్టు వివాదాల వల్ల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. గుంటూరు జిల్లాలోని కార్పొరేషన్‌తో సహా మునిసిపాల్టీల్లో రూ 7.52 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ 9.73 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 1.77 కోట్లు బకాయిలు ఉన్నాయి. తెనాలి మునిసిపాల్టీలో 31 కేసుల వల్ల రూ.2.98 కోట్లు పన్ను వసూలు నిలిచిపోయింది. గుంటూరు కార్పొరేషన్‌లో 66 కేసులు కోర్టుల్లో ఉన్నాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీలో రూ.9.58 కోట్లు కోర్టు వివాదాల వల్ల బకాయిలు ఉన్నాయి. 6,045 అసెస్‌మెంట్‌లకు సంబంధించి కోర్టులలో పిటిషన్‌లు దాఖలయ్యాయి. కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించుకొని ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయడంతో అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

అవీ..ఇవీ..

సైడుకాలువ, కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన



సైడుకాలువ, కల్వర్టు శంకుస్థాపనలో అధికారులు, నాయకులు

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైడుకాలువ, కల్వర్టు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన కింద మంజూరైన రూ.2 లక్షల నిధులతో వాటి నిర్మాణం చేపడుతున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, గ్రామ నాయకులు సింగు చంద్రశేఖర్, దొడ్డా అప్పారావు, వల్లెపోగు సాల్మన్, గరికపూడి చినభూషణం, నాగభూషణం, జాగర్లమూడి సాంబయ్య, కృపారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లును పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గీతాజయంతి సందర్భంగా సోమవారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో రాజుపాలెం చిన్మయా మిషన్ అధ్యక్షులు మాజీ రోటరీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు 100 మంది పేదలకు దుప్పట్లును పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, గోనుగుంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ఆన్‌లైన్ పరీక్ష పోటీలో పర్చూరు వాసికి బంగారు పతకం

- స్వామీజీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ప్రసన్న



ప్రసంసాపత్రం అందుకుంటున్న ప్రసన్న, శ్రీనివాసరావు దంపతులు

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో ఏటా భగవద్గీతపై నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షలో ఈ ఏడాది పర్చూరుకు చెందిన రోటరీ ఇన్నర్‌వీల్ మాజీ అధ్యక్షురాలు, వైస్ ఎంపీపీ కోటా ప్రసన్నకు బంగారు పతకం దక్కింది. మైసూరు దత్త పీఠంలో సోమవారం ఆమెకు దత్తపీఠాధిపతి చేతుల మీదుగా పురస్కారంతో పాటు, బంగారు పతకం అందుకున్నారు. ఆధ్యాత్మిక జ్ఞానానికి ప్రతీకగా నిలిచే భవగద్గీతపై పట్టుసాధించి ప్రథమస్థానంలో నిలిచిన ప్రసన్నకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూవులు అతి పవిత్రంగా భావించే భవగద్గీత పోటీల్లో పాల్గొనడం, స్వామిజీ చేతుల మీదుగా అవార్డు అందుకోవటం భగవంతుని సంకల్పం అన్నారు.

చిట్టిబాబు మృతి పార్టీకి తీరనిలోటు



చిట్టిబాబు చిత్రపటానికి పూలమాలలతో నివాళ్లులర్పిస్తున్న నేతలు

ఇంకొల్లు, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి) :మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన కరి చిట్టిబాబు అనారోగ్యంతో మృతి చెందడం టీడీపీకి తీరని లోటని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. సోమవారం గంగవరంలో చిట్టిబాబు దశదినకర్మ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లులర్పించారు. వారిలో కరి శ్రీనివాసరావు, పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, పాలేరు రామకృష్ణ, బోడెంపూడి సుబ్బారావు, శివయ్య, కరి వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

గ్రానైట్ యజమానుల ఆందోళనపై విచారణకు ప్రత్యేక కమిటీ

బల్లికురవ, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ సీనరేజ్ వసూళ్ల చెల్లింపులపై ఫ్యాక్టరీ యజమానులు చేపట్టిన ఆందోళనపై సోమవారం జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి రామచంద్ర వివరణ ఇచ్చారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో మైనింగ్ సీనరేజ్‌లపై యజమానుల ఆందోళన అని ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కమిటీ నిర్ణయం వచ్చే వరకు ఎవరు ఆందోళనలు చేపట్ట వద్దన్నారు. సీనరేజ్ వసూళ్లు చేస్తున్న కంపెనీతో గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్లు సమావేశమవుతాయని, ఫ్యాక్టరీలు యథావిధిగా పనిచేస్తున్నాయని తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసమే తొలి అడుగు

- పండుగ వాతావరణంలో సామాజిక పింఛన్లు
- పాల్గొని సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే



ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రతీరోజు ప్రజాసమస్యల పరిష్కారంకోసమే తొలి అడుగు వేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి మండల పరిదిలోని సాయికాలనీ, వేటపాలెంలో రామన్నపేట, పురపాలక సంఘం పరిధిలో 5వ వార్డులో పర్యటించారు. ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలో 17 నెలల్లో రూ.50,763 కోట్లు పింఛన్ల ద్వారా అందించినట్లు వివరించారు. నిరుపేదలకు నివేశన స్థలాలుతో పాటు పక్కా గృహ కల్పనకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎంపీడీవోలు విజయ, రాజేష్‌బాబు, తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో 92శాతం ఫించన్ల పంపిణీ

పంగులూరు : మండలంలోని 21 పంచాయతీల పరిధిలో సోమవారం 92 శాతం పించన్ల పంపిణీ చేశారు. మండలంలో మొత్తం సామాజిక ఫించన్లు 7,810 కాగా 7,164 మందికి ఫించన్లు అందచేశారు. మండల కేంద్రమైన పంగులూరులో టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, ముప్పవరం గ్రామంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ కుక్కపల్లి ఏడుకొండలు, నియోజక వర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గరిమిడి జగన్మోహన్ రావులు సామాజిక ఫించన్లు లబ్దిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అద్దేపల్లి యోహాన్, టీడీపీ గ్రామ అధ్యక్షులు వేల్పుల మరియదాసు, తిరుమలశెట్టి వీరాంజనేయులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : పించన్లను ప్రతి నెల ఒకటో తేదీన ఇంటింటికి అందజేసి నిరుపేద కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కత్తి ఆశోక్‌బాబు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం బల్లికురవ గ్రామంలో ఆయన వృద్దులకు పించన్లను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ఒక్క ఆంధ్ర రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున పింఛన్లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఇంటింటికి తిరిగి లబ్దిదారులకు పించన్లను అందజేశారు.

యద్దనపూడి,(మార్టూరు) : దేశంలోనే సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం ఆయన యద్దనపూడి మండలంలోని సూరవరపుపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గానికి కొత్తగా 80 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్‌ను మంజూరు చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందరికీ ప్రతి నెలా 1వ తేదీ పెన్షన్ల నగదును అందజేసే విధంగా ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. తరువాత గ్రామంలోని రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ రిజిస్టర్, బయోమెట్రిక్ వ్యవస్థలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సైడు డ్రైనేజీని, సిమెంట్‌రోడ్డును పరిశీలిం చారు. వాటిని వేగవంతంగా పూర్తిచేయాలని, నాణ్యతతో పనులు జరగాలని సంబందిత అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా సైడుకాల్వల్లో మురుగునీరు సక్రమంగా పారేవిధంగా చూడాలని, నిల్వ ఉండరాదని సూచించారు. గ్రామంలోని పలువీధులలో పర్యటించారు. కార్యక్రమంలో కోయసతీష్, గుదే తారకరామారావు, వంశీ కృష్ణ, నల్లపనేని రంగయ్యచౌదరి, రావిపాటి సీతయ్య ఇంటూరి మురళి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.





ముప్పవరంలో పింఛన్ అందజేస్తున్న ఏడుకొండలు, సూరవరపుపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏలూరి సాంబశివరావు

అసౌకర్యం లేకుండా ఫించన్ల పంపిణీ

పర్చూరు : ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఫించన్‌దారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఇంటివద్దనే ఫించన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వి.ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. సోమవారం సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల సారధ్యంలో పర్చూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఫించన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కార్యదర్శులతోపాటు, సచివాలయం సిబ్బంది ఉదయం 6.30 గంటల నుంచి పించన్ల పంపిణీలో పాల్గొన్న ట్లు ఎంపీడీవో తెలిపారు.

దిత్వాతో సముద్రం ఉగ్రరూపం

- రోజంతా నానుడి వర్షం
- ఆందోళనలో రైతన్నలు



ఉగ్రరూపం దాల్చిన సముద్రం

వాడరేవు(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌తో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు, రైతులకు తిరిగి దిత్వా తుఫాన్‌తో ఆందోళన మొదలైంది. రెండు రోజులుగా తుఫాన్ కారణంగా నాన్పుడు చినుకులు పడుతూనే ఉన్నాయి. ఆకాశం మేఘావృతమై ఉంది. ఈక్రమంలో వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం తీరప్రాంతాల్లో సముద్రం దాదాపుగా 10 అడుగుల మేర ముందకు వచ్చింది. సముద్రం ఉగ్రరూపం దాల్చి ఎడ తెరపి లేకుండా అలలు ఎగిసిపడుతూ బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. మరొక వైపు అధికారులు, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల సాయంతో గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందిస్తున్నారు. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో గతంలో అన్న దాతలు వరి, వేరుశనగ సాగు చేసి మొంథా తో తీవ్రంగా నష్టాల బారినపడ్డారు. తాజాగా మరోమారు పంటలు ప్రారంభించారు. ఇవి ఆరంభ దశలో ఉన్నాయి. ఇప్పటివరకు కురిసిన వర్షాలు కారణంగా రైతాంగానికి పెద్దగా ఇబ్బందులు లేవు. ఇదే తరహా వర్షాలు కురిస్తే రైతాంగం తీవ్ర సంక్షోభంలో పడే అవకాశం ఉందని అన్నదాతల ఆందోళన చెందుతున్నారు.

చీరాల్లో జన్మదిన వేడుకలతో సంతృప్తి

- ప్రజలు మమ్మల్ని విశ్వసించారు
- నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా
- టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న హీరో నికిల్

చీరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో పుట్టిన రోజు వేడుకలు మునుపెన్నడూ లేని సంతృప్తినిచ్చాయని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలో ఆయన పుట్టినరోజు వేడుకలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా కొత్తపేట నివాసం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో కొనసాగింది. ఈక్రమంలో అభిమానులు పలుచోట్ల భారీ గజమాలలతో స్వాగతం పలికారు. సెయింట్‌మార్క్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గడియార స్థంభం కూడలితో పాటు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్‌లు నిర్వహించారు. అలాగే అభిమానులు రక్తదానం చేశారు. ఈ పుట్టిన రోజు వేడుకలకు సినీ నటుడు నిఖిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను ప్రజలు ఆదరించాలన్నారు. మమేంద్రనాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన తండ్రి చేస్తున్న సేవలను ప్రజలు ఆదరిస్తున్నట్లు వివరించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో కూటమి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువనాయకులు గౌరీ అమర్నాథ్, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులను ఆదరించాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సౌమ్య

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను మానతా దృక్పథంతో ఆదరించాలని పర్చూరు ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గేరాడ్స్ ఫౌండేషన్ చీరాల వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సూపరిండెంట్ సౌమ్య మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన రోగులపై వివక్ష చూపడం, దూషించటం, చట్టారీత్యా నేరమన్నారు. సరైన అవగహన లేకపోవడం వలన ఎయిడ్స్ రోగులు పెరగటానికి కారణమన్నారు. కార్యక్రమంలో గేరాడ్స్ ఫౌండేషన్ చైర్మన్ అల్లడి కనకరత్నం, ట్రస్టీ గేరా స్వరాజ్, కళాశాల కరస్పాండెంట్ ఒగ్గిశెట్టి నరసింహం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషుకుమారి, మామిడిపాక హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : రోగాల బారిన పడిన బాధితుల పట్ల ప్రజలు స్నేహ పూర్వకంగా మెలగాలని పందిళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డా.హర్షవర్ధన్ ఆదిత్య అన్నారు. సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల వారి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈక్రమంలో భాగంగా ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు అశోక్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ కట్టా రాణీ, విఎల్‌వీ మథీన్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కేంద్రం తీరుతో ప్రజాస్వామ్యం అస్తవ్యస్తం

- కాంగ్రెస్ కార్యకర్తలతో పరిశీలకులు అహర్ ప్రత్యేక సమావేశం



కార్యకర్తలను ఉద్దేసించి మాట్లాడుతున్న పరిశీలకులు అహర్

పేరాల(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీరుతో ప్రజాస్వామ్యం అస్తవ్యస్తంగా మారిందని ఏఐసీసీ పరిశీలకులు షారద్ అహర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పేరాల పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తీరును ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని చెప్పారు. ఆమంచితో పార్టీ బలోపేతమవుతుందని విశ్వసించారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ విజయపాల్, పర్చూరు పార్టీ ఇన్‌చార్జ్ జ్యోతి, జిల్లా నాయకులు మార్పు గ్రెగోరీ, జడ్పీటీసీ సభ్యురాలు ఆకురాతి పద్మిని, బండ్ల తిరుమలదేవీ పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలు మత్స్యకార గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

దాబాలు, రెస్టారెంట్లలో పోలీసుల తనిఖీ



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు

అద్దంకి ,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్‌లు, దాబాలు హోటళ్లలో మద్యం అమ్మకాలు చేసినా, మద్యం సేవించినా చర్యలు తప్పవని అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భవాని అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్లల మద్యం అమ్మకాలపై ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. సోమవారం పలు రెస్టారెంట్లు తనిఖీ చేశారు. అన్ని రెస్టారెంట్లలలో మద్యం అనుమతించబడదు అనే బోర్డులు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. రెస్టారెంట్‌ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే 94409 02497 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

చక్కటి ఆహారపు అలవాట్లతో హెచ్‌ఐవీ నియంత్రణ

డాక్టర్ వాహిలా చౌదరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీటీసీ సిబ్బంది

అద్దంకి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సకాలంలో మందులు తీసుకోవడం, మంచి ఆహారపు అలవాట్లు ద్వారా ఎ యిడ్ వ్యాధిని ఎదుర్కోవచ్చని డాక్టర్ వాహిలా చౌదరి అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాల నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాదులు వచ్చిన వారు తీసుకోవాల్సిన ఆహారం మందులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉచిత న్యాయసహాయకులు టి.మార్త శ్రీను, షేక్ మహమ్మద్ రఫీ, ఎం. ప్రకాష్, పంతంగి ధనంజయరావు, స్వప్న పాల్గొన్నారు.

అద్దంకి సీహెచ్‌సీలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యశాల సిబ్బందితో అవగాహన ర్యాలీ, సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షధారణ స్వాములకు అన్నదానం

- ఏటా 41 రోజుల పాటు నిర్వహణ
- సోమవారంతో ముగిసిన అన్నదాన కార్యక్రమం



చద్ది స్వీకరిస్తున్న దీక్షదారులు

ఇంకొల్లు, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి) : మాలధారణ చేసిన ఓ భక్తుడు చేసిన ఆలోచనతో ఇంకొల్లులో 18 ఏళ్లగా 41 ఏళ్లగా అన్నదానం కొనసాగుతోంది. దాత సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఈ ఏడాది సోమవారంతో ముగించారు. ఇంకొల్లులో అన్నదాన కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని పలుగ్రామాలలో స్వాములకు అన్నదానం నిర్వహించడం గమనార్హం. ఇంకొల్లు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రెండేళ్లుగా పువ్వాడ రవి గురుస్వామి స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నారు. మొంథా తుఫాన్‌తో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఆయా రోజుల్లో సైతం స్వాములకు ఇబ్బందులు పడకుండా అన్నదానం నిర్వహించారు. ఈ ఏడాది అక్టోబరు 22న అన్నదాన కార్యక్రమం ప్రారంభించి డిసెంబరు 1వ తేది వరకు 41 రోజుల పాటు నిర్వహించారు. సుమారు ప్రతి రోజు 250 నుండి 300 మంది మాలధారణలకు అన్నదానం నిర్వహించారు. ఈ ఏడాది ఇంకొల్లు ప్రాంతంలో ఎక్కువ మంది మాలధారణ చేశారు. సోమవారంతో అన్నదానం ముగిసింది.

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పంగులూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సీపీఎం నాయకుడు పెంచలయ్యను దారుణహత్య చేసిన గంజాయి గూండాలను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగబోయిన రంగారావు డిమాండ్ చేశారు. పెంచలయ్య దారుణ హత్యను నిరసిస్తూ, పంగులూరు ప్రధానకూడలిలో సీపీఎం నేతలు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగబోయిన రంగారావు మాట్లాడుతూ నెల్లూరులో గంజాయి గూండాలను అడ్డుకునేందుకు పెంచలయ్య పోరాటం చేశారన్నారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ పోరాటం చేశాడన్నారు. గంజాయి వ్యాపారానికి అడ్డుగా ఉన్నాడని పెంచలయ్యను హతమార్చిన దుండగులందరినీ కఠినంగా శిక్షంచాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తలపనేని రామారావు, గుడిపాటి మల్లారెడ్డి, ఆదుంసాహెబ్, సుధాకర్, ఏలియా, సుబ్బారావు, శ్రీనావాసరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ

ఇంకొల్లు, డిసెంబరు 1,(ఆంధ్రజ్యోతి) మండల విద్యావనరుల కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు ఇంకొల్లుకు చెందిన పొన్నగంటి లక్ష్మీనరేంద్ర బాబు తన పుట్టిన రోజు సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో ఎంఈవో శ్రీనివాసరావు, పొన్నగంటి జానకిరామారావు, హరిబాబు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.